విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 13 ఆగస్టు 2024 8 పేజీలు

ప్రజలకు మెరుగైన సేవలు

కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారం దిశగా క్షేత్ర స్థాయి అధికారుల ద్వారా పరిష్కారం చేపట్టాల్సిన అర్జీలు కలెక్టరేట్‌కు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లో ప్రజల నుంచి కలెక్టర్, ఇన్‌చార్జి జెసి జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా 187 అర్జీలను స్వీకరించామన్నారు. వాటిలో రెవిన్యూ 71, పోలీసు 30, పౌర సరఫరాలు 26, పంచాయతీ రాజ్ 25, ఇతర శాఖలు 35 అర్జీలు స్వీకరించామన్నారు. డివిజన్, మిగతా 2లో

నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఇటీవల సంభవించిన వరదల వలన నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. మద్దిగట్ల గ్రామంలో సోడే సత్తిబాబు అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన శాఖ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చిన్న, సన్నకారు రైతులను, కూలీలను వరదలు తీవ్రంగా నష్టపరిచాయన్నారు. ఉపాధి లేక కుటుంబ పోషణ వారికి భారంగా మారిందన్నారు. రెక్కల కష్టం మీద కూడగట్టుకున్న ఆస్తి వరద పాలవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు విత్తనాలు ఎరువులు ఉచితంగా ఇవ్వడంతో పాటు పెట్టుబడి అవకాశం కల్పించాలన్నారు. పంటలు పండే భూముల్లో ఇసుక మేటలు ఒంద్రు మట్టి పేరుకు పోయి వందల ఎకరాల భూమి సాగుకు పనికిరాకుండా ఉందని పూర్తిగా ప్రభుత్వం ఖర్చు భరించి ఆయా భూములను సాగు లోకి తీసుకొచ్చి రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశానంతరం నూతన శాఖ కమిటీ, మహిళా సమాఖ్య కమిటీ లను11 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలు పార్టీ అభివృద్ధికి ఉత్సాహంగా పనిచేయాలని, గ్రామ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.

వరద బాధితులకు దుస్తులు పంపిణీ

వరదల వలన నష్టపోయిన మద్దిగట్ల గ్రామానికి చెందిన 60 కుటుంబాలకు దుప్పట్లు, దుస్తులు అందించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా ప్రసాద్, నాయకులు కారం కుమారి, సోడే ప్రసాద్, సోడే నాగేశ్వరరావు,

ముత్యాలరావు, వీరబాబు, మడివి రామలక్ష్మి, సోడే దుర్గ, మడకం రాజేశ్వరి, మడివి మంగ, సోడే సూర్యకుమారి, సోడే మోనిక తదితరులు పాల్గొన్నారు.

యానాదులకు న్యాయం చేయాలి

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర - ఉండి: ఉండి యానాదుల కాలనీలో రోడ్డు పక్కన సుమారు 40 సంవత్సరాల క్రితం ఇళ్ళు వేసుకుని నివాసముంటున్న ఎస్.టి యానాదులకు చెందిన కె.మావుళ్ళమ్మ, కంది సీతమ్మల ఇళ్ళను తొలగించాలని దౌర్జన్యానికి పాల్పడుతున్న ఇర్రింక సూర్యనారాయణపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుని యానాది మహిళలకు న్యాయం చేయాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు.సోమవారం యానాదుల ఇళ్ళను తొలగించాలని దౌర్జన్యానికి ఒడిగడుతున్న ఇర్రింకి సూర్యనారాయణపై చర్యలు కోరుతూ సీపీఐ ఉండి మండల సమితి ఆధ్వర్యంలో ఉండి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పంచాయతీ అధికారు లకు, పోలీసు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు, సీపీఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ యానాదులను అక్రమంగా తొలగించి ఆ స్థలాలను ఆక్ర మించుకోవాలనే దురుద్దేశంతోనే ఇర్రింకి సూర్యనారాయణ యానాదులపై దౌర్జన్యానికి ఒడిగడుతున్నాడన్నారు. ఇర్రింకి సూర్యనారాయణ ఇప్పటికే పంట బోదె పూడ్చివేసి కొబ్బరి మొక్కలు నాటాడని, మిగతా 2లో

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

ప్రభుత్వాసుపత్రి సెక్యూరిటీ కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి ,మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కు మూడు నెలలుగా జీతాలు

లేవని, వెంటనే జీతాలు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని ,పిఎఫ్ అకౌంట్ ఇవ్వాలని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా జీతాలు పెంచాలని తదితర నినాదాలు చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుంద్రపు మాట్లాడుతూ ఈరోజుల్లో ఒక్కరోజు అద్దె పెండింగ్లో ఉన్న ఇల్లు ఖాళీ చేయమంటున్నారని, మిగతా 2లో

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను తెలియజేసి వాటి వినియోగాన్ని అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నషాముక్త్ భారత్ అభియాన్(ఎన్ఎంబిఎ) కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జిల్లా అధికారు లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఇటువంటి రుగ్మత లను రూపుమాపేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావలపై పాఠ శాలు, కళాశాలల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన మిగతా 2లో

'మత్తు'తో భవిష్యత్తు అంధకారం

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- అలవాటుపడితే ఉజ్వల భవిష్యత్తుకు ఆటంకం
- కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి యువతకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విష్ణు కాలేజ్ ఆడిటోరియంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో "నష ముక్త్ భారత్ అభియాన్" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మిగతా 2లో

మీకోసంలో ఎనిమిది అర్జీలు

విశాలాంధ్ర -నూజివీడు : సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నూజివీడు ఆర్డీవో వై. భవాని శంకరి అధ్యక్షతన జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో 8 అర్జీలు దాఖలయ్యాయి. అర్జీలు అందుకున్న ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి సమస్యను ఆన్లైన్ చేసి నిర్దేశిత సమయంలో పరిష్కారం చేస్తామన్నారు.

ట్రిపుల్ ఐటీలో నాషా ముక్త్ భారత్ అభియాన్

విశాలాంధ్ర-నూజివీడు: నూజివీడు ఆర్జీయుకేటీ విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవం-2024లో భాగంగా "నాషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.చంద్రశేఖర్, రత్నాకర్ డీన్ అకడమిక్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కింద క్యాంపస్‌లో డ్రగ్స్‌పై సామూహిక ప్రతిజ్ఞ, ప్లాంటేషన్ డ్రైవ్, మారథాన్ నిర్వహించారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

విశాలాంధ్ర-లింగపాలెం: కె.గోకవరంలో నాటు సారా తయారీ కేంద్రంపై ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈదాడిలో ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. సారా తయారీకి వినియోగించే వస్తువులను 1600 లీటర్ల బెల్లంఊట, పది లీటర్ల సారా, 15కిలోల బెల్లం, 5 కిలోల పంచదార, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు.

మిషన్ శక్తి 100 రోజులుపై అవగాహన

విశాలాంధ్ర- పాలకోడేరు : మిషన్ శక్తి"100 రోజులు పోగ్రామ్ లో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి ఆధ్వర్యంలో బేటి బచావో భేటీ పడావో ప్రోగ్రామ్ సోమవారం పాలకోడేరు ఉన్నత పాఠశాలలో జరిగింది, ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థిని పట్ల, మహిళల పట్ల అనవసరంగా తాకుట గురించి లైంగిక వేధింపుల గురించి ప్రతి ఒక్కరూఅప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు గురించి తెలియ జేశారు. బాలికలకు మహిళా చట్టాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్స్ చట్టం గురించి, ఎవరైనా లైంగిక వేధింపులకు గురి చేస్తే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత హెల్ప్ లైన్ నెంబర్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులతో పాటు, మహిళా టీచర్లు పాల్గొన్నారు.

తహసీల్దారును కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండల తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన చెల్లన్న దొరను తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని.అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు పారేపల్లి నరేష్ మాట్లాడుతూ కలెక్టరేట్లో, రెవిన్యూ డివిజన్లో, వివిధ మండలాల్లో తహసీల్దారుగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న చెల్లన్న దొర కొయ్యలగూడెం మండలానికి రావడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలోపట్టణ అధ్యక్షుడు రామకృష్ణారావు, బాబురావు, సత్యనారాయణ, సిద్దు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు (1వ పేజీ తరువాయి)

మండల స్థాయిలో పరిష్కారం అయ్యే అర్జీలు కలెక్టరేట్‌కు వస్తున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం సాధ్యం అవుతుందని ప్రజల్లో నమ్మకం పెంచేలా అధికారుల పనితీరు ఉండాలన్నారు. ఈ సందర్భంగా డివిజన్, పలు మండలాల నుంచి వచ్చిన అర్జీల సమస్యలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ అక్కడికక్కడే ఆయా డివిజన్, మండల అధికారులతో కలెక్టర్ మాట్లాడి సమస్య పై చర్చించారు. వివిధ శాఖల తరపున కోర్టు కేసుల విషయంలో ప్రస్తుతం ఉన్న అధికారి వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని, చర్యలు తీసుకోవడం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా జిల్లా అధికారులు, అనుబంధ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

విశాలాంధ్ర-ఏలూరు: హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన, వివరాలను పొందేందుకు ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నెంబర్ 1097 నెంబర్ ను ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు.నాకో మార్గదర్శకాలతో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆజ్ఞలతో రెండు నెలలపాటు "మీ కోసం" కార్యక్రమం 12 ఆగస్టు 2024న నిర్వహించబడుతున్న కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టరు కె. వెట్రిసెల్వి జిల్లా అధికారుల సమక్షంలో విడుదల చేశారు.జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ గర్భిణికి మొదటి మూడు నెలల్లోనే హెచ్ఐవి పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషిచేయాలని కోరారు..కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. పుష్పమణి, డి.ఆర్.డి.ఏ.పిడి ఆర్. విజయ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు యం. ముక్కంటి, కె. భాస్కర్, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ పి. బాలాజీ, జిల్లా సూపర్ వైజర్ ఏ. హరినాధ కుమార్, జిల్లా హెచ్. ఐ. వి పాజిటివ్ నెట్వర్క్ ప్రెసిడెంట్,. శివ కృష్ణ , పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిష్యత్తు అంధకారం
(1వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ ఆరోగ్యవంత మైన సమాజ నిర్మాణానికి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వలన అనేక అనారోగ్య రుగ్మతలకు గురవుతారన్నారు. మీ ఉజ్వల భవిష్యత్తుకు మత్తు పదార్థాలు ఆటంకం కాకూడ దని ఉద్బోధించారు. మంచి చెడు తెలిసిన వయస్సులో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా వాటి బారిన పడితే వారికి దగ్గరగా ఉండి అవగాహనతో మార్చే ప్రయత్నం చేయాలని సూచించారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాల యాలు, ఇంజనీరింగ్, వైద్య కళాశాలల్లో మత్తు పదార్థాల నిరోధానికి అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం కారణంగా హింసకు ప్రేరేపితులవుతారని, మానసికంగా కూడా గందరగోళ పరిస్థితి ఉంటుందని, ఇటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. స్నేహాలు, బంధాలు, బంధుత్వాలు మత్తు పదార్థాల సేవనంతో దూరం కాగలరని, సమాజంలో మంచి నడవడికతో మెలగాలని సూచించారు. తొలుత పలువురు విష్ణు కాలేజీ విద్యార్థులు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలు, మానవుల శరీరంలో ఆరోగ్యంపై చూపించే ప్రభావాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. చివరిగా మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం అంటూ సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, సెబ్ అడిషనల్ ఎస్పీ ఎటీవీ రవికుమార్, డిఇఒ నాగమణి, విష్ణు కళాశాల ప్రిన్సిపాల్ ఐ.ఆర్.కే రాజు, ఎం.వేణు, విద్య, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రభావాలపై అవగాహన
(1వ పేజీ తరువాయి)

సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు తలెత్తుతాయని అందుకే దేశ భవిష్యత్తును కుంగదీసే మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికడదామన్నారు.

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే ఎన్ పి డిఎస్ యాక్ట్ లో పేరు నమోదైత్ సొసైటీలో ఉనికి కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు యం. ముక్కంటి, కె. భాస్కర్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి రాకడ మణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విడుదల చేయాలి
(1వ పేజీ తరువాయి)

చాలీచాలని జీతాలతో బతుకు నడపడం చాలా కష్టంగా ఉందని ఇటువంటి తరుణంలో మూడు నెలలుగా జీతాలు మంజూరు చేయకపోతే ఎలా బతకాలని రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు . గత రెండు నెలలుగా జీతాలు మంజూరు చేయాలని కాంట్రాక్ట్ ను ,ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంటును కలిసి విజ్ఞప్తి చేసున్నా స్పందన లేదని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆర్ఎంవోను కలిసిన ఏఐటీయూసీ నాయకులు చర్చలు జరిపారు. అనంతరం ఆర్ఎంఓ వారం రోజులు గడువు కావాలని తెలియజేశారు. దీంతో కార్మికులు సమ్మెను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు వి. కొండలరావు, చింతలపూడి సునీల్ యూనియన్ అధ్యక్షులు మొలగాడ ప్రసాద్‌రావు, కుమార్ ,పెద్దబ్బాయి మోహన్, నరేష్, సూరిబాబు, భాగ్యలక్ష్మి, సుశీల అనంతలక్ష్మి, విజయలక్ష్మి, మీనాక్షి , గంగ రత్నం, వరలక్ష్మి శ్రీనువాస్, శివ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి
(1వ పేజీ తరువాయి)

యానాదుల ఇళ్లను పూర్తిగా తొలగింప చేసి ఆ స్థలాలను తన ఆధీనంలోకి తెచ్చుకోవాలనే దురుద్దేశంతో యానాది మహిళలను కులం పేరుతో దూషిస్తూ అసభ్యకరమైన పదజాలంతో బూతులు తిడుతూ అనుచితంగా ప్రవర్తిస్తూ ఎస్.టి.మహిళలను అవమానపరుస్తున్నా రన్నారు. ఎస్.టి. మహిళలను కులం పేరుతో దూషిస్తూ అసభ్యకరమైన పదజాలంతో బూతులు తిడుతూ దౌర్జన్యానికి ఒడిగడుతున్న ఇర్రింకి సూర్యనారాయణ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యానాది మహిళలకు రక్షణ కల్పించి తగు న్యాయం చేయాలని కోరారు. ధర్మాకు బాధిత మహిళలు కె.మావుళ్ళమ్మ,కంది సీతమ్మ, సీపీఐ నాయకులు ఎం. సీతారాం ప్రసాద్,సనపల శ్రీనివాస్, పతివాడ గణపతి,దొమ్మేటి వెంకన్న,చలంచర్ల మంగయ్య,ఈతాకుల వెంకన్న,చేపూరి రమణయ్య తదితరులు నాయకత్వం వహించారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-భీమడోలు: నేటి బాలలే రేపటి పౌరులు అన్న నానుడి గుర్తుగా, సమాజంలో యువత మాదకద్రవ్యాలు బారిన పడకుండా ఉండాలని భీమడోలు సీఐ బి.బి. రవికుమార్ తెలిపారు. నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీమాధురి జూనియర్ కాలేజ్(బాలికల ప్రత్యేక) ప్రాంగణంలో మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భీమడోలు సి.ఐ. బి.బి. రవి కుమార్, ఎస్.ఐ. సుధాకర్, ఎక్సైజ్ సి.ఐ. గిరిజ కుమారి పాల్గొని మాట్లాడుతూ నేటి యువత ఏ విధంగా మాదకద్రవ్యాలకు బానిస అవుతుంది, ఎలా వాటి బారిన పడి నష్టపోతున్నారో అవగాహన కల్పించారు.వాటికి దూరంగా ఉండాలని, 14500 టోల్ ఫ్రీ నెంబర్ సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత శ్రీప్రేమ్ కుమార్, ప్రిన్సిపాల్ అశోక్, కేసరి, కళాశాల ఇన్‌ఛార్జి బాలు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ దోమల నివారణ

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధా కృష్ణయ్య (చంటి) ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 1వ డివిజన్ లోని కోమడవోలు, కోడేలు మెయిన్ రోడ్డు, హమాలి కాలనీ, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలలోఉన్న నిలవనీటిలో ఆయిల్ బాల్స్ వేయడం జరిగిందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గరికపూడి చంటిబాబు, మూరాల దుర్గారావు, మేతర అశోక్, మలేరియా ఇన్స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, మలేరియా మేస్త్రి డి. దుర్గారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ బౌన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సేవలు ఆదర్శనీయం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ముసునూరు వెంకటలక్ష్మి అధ్యక్ష తన సోమవారం నిర్వ హిం చారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిం చారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైందని, దీనివల్ల భూగర్భ జలాలు పెరిగాయని అధికారులు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రాంబాబును సన్మానించారు. ఎన్నికల ముందు బదిలీపై వచ్చిన ఈయన తిరిగి బదిలీపై కృష్ణా జిల్లాకు వెళుతుండటంతో ఈయన సేవలను కొనియాడుతూ సభ్యులు ప్రసంగించారు. ఈయన బదిలీపై వెళ్లడమే గాక ఈ నెలలోనే పదవీ విరమణ అవుతుండటాన్ని పురస్కరించుకొని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు మట్టా సురేష్, కల్లపూడి రూసీ పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాల యంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఆకస్మిక మృతి చెందిన పరస సత్యరాజుకు సమావేశంలో సభ్యులు సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు.

కోడి వ్యర్థాల తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర - భీమడోలు : భీమడోలు మండలం లింగంపాడులో చేపల చెరువుల్లో మేతగా కోడి వ్యర్థాలను తరలిస్తున్న లారీని గ్రామస్తులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఓ మాజీ ప్రజాప్రతి నిధి భరోసాతో ఇద్దరు బడా చేపల రైతులు ఈ కోడి వ్యర్థాలను తరలిస్తుండగా జనసేన నాయకులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పర్యావరణానికి ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే జంతు వ్యర్థాల అక్రమ రవాణా చేసే బాధ్యులను శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటులోని అసంబద్ధాలపై డీఈఓకు ఫ్యాప్టో ప్రాతినిధ్యం

విశాలాంధ్ర -భీమవరం : ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఉత్తర్వులలోని పలు అసంబద్ధాలపై సోమవారం పశ్చిమగోదావరి జిల్లా డీఈఓకు ఫ్యాప్టో వినతిపత్రం అందించింది. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై పశ్చిమగోదావరి జిల్లా ఫ్యాప్టోలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, పని సర్దుబాటులో సీనియర్‌కి వెళ్లిన అవకాశం కల్పించాలని, సీనియార్టీలో ప్యానల్‌ను పరిగణనలో తీసుకోవాలని, పని సర్దుబాటును మండల లేదా డివిజన్ స్థాయికి మాత్రమే పరిమితం చేయాలని, ఏ మేనేజ్మెంట్లో పనిచేసే ఉపాధ్యాయులను ఆ మేనేజ్మెంట్ లోనే సర్దుబాటు చేయాలని, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ పోస్టులను రోల్‌తో సంబంధం లేకుండా అదనంగా అలాగే కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో పది సెక్షన్ లు దాటిన సందర్భంలో రెండవ హిందీ రెండవ పిఎస్ పోస్టులను కేటాయించాలని.... ఇలా ఉపాధ్యాయుల పని సర్దుబాటులో ఉన్న అన్ని అసంబద్ధాలను ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలియజేశారు. అనంతరం డిఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు చేసిన సూచనలన్నీ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయుల పని సర్దుబాటులోని అసంబద్ధాలను సవరించాలని డీఈఓ కు లేఖ ద్వారా ప్రాతి ని ధ్యం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నుంచి విజయరామరాజు, రామభద్రం ఎస్టీయు నుంచి రామచంద్రారావు, పిఆర్‌టియుఎస్ సాయివర్మ, ఏపీటీఎఫ్ నుంచి ప్రకాశం, నారాయణ, బి టి ఏ నుంచి వెంకటేశ్వరరావు, డిటిఎఫ్ నుంచి శ్రీనివాసరావు ,ఏపీటీఎఫ్-1938 నుండి రమణ, ఆర్ యు పి పి నుంచి ప్రదీప్ , అపస్ నుండి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ రంగనాథ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - తణుకు : స్థానిక పురుషుల శాఖా గ్రంథాలయంలో సోమవారం డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథ్ 132 వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. లైబ్రేరియన్ పి. సుగుణ కుమారి ఆధ్వర్యంలో వావిలాల సరళా దేవి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వావిలాల సరళా దేవి డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా సరళా దేవి మాట్లాడుతూ ఎస్ ఆర్ రంగనాథన్ గారి జీవిత విశేషాలను వివరిస్తూ గ్రంథాలయాలకు ఆయన చేసిన సేవలకు ఆయనకు పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించారన్నారు.ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా అంతటా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

విశాలాంధ్ర -భీమవరం: ప్రజల నుండి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లో "మీకోసం" సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. "మీకోసం కార్యక్రమం" నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వస్తారని అర్జీదారుల సమస్యలను అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. మీకోసంలో ప్రజల నుండి అందిన అర్జీలను గడువు దాటకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, అర్జీదార్లకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చు అర్జీలపై దృష్టి సారించాలన్నారు. కోర్టు ధిక్కరణ కేసులలో కౌంటర్స్ ఫైల్ చేయాలని అన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత

అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 186 ఫిర్యాదులను స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి డాక్టర్ కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వయో వృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: మీకోసం(ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) అర్జీలు పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ కెవెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు యం. ముక్కంటి, కె. భాస్కర్, అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 182 అర్జీలు మీకోసం లో నమోదు అయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా

కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులు ఆదేశించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీ దారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కార తీరు ఉండాలన్నారు.

మహనీయుల బాటలో నడుద్దాం

విశాలాంధ్ర-వీరవాసరం: మహనీయుల బాటలో నడుస్తూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నేతలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా అభియాన్' లో భాగంగా ప్రధాని మోది పిలుపు మేరకు మండల కేంద్రం వీరవాసరంలో "తిరంగా యాత్ర " సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ యాత్ర స్థానిక ఎంపిడివో కార్యాలయం నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల

త్యాగాలు నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని, ఎంతోమంది త్యాగధనుల వల్ల ఈరోజు మనం స్వతంత్రంగా ఉండగలుగు తున్నామన్నారు. ర్యాలీలో స్థానిక లిటిల్ బడ్స్, భారతీ, డివైన్ మెర్సీ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు, విఇసి జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యా ర్థులు, ఉపాధ్యాయులు, బిజెవైఎమ్ జిల్లా అధ్యక్షులు వినోద్ వర్మ,జెడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర- ఏలూరు : ఏలూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన పిఏసీ చైర్మెన్ నాదెండ్ల మనోహర్ కి ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రెడ్డి అప్పల నాయుడు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఏలూరులోని సి ఆర్ రెడ్డి కళాశాలలో ఏర్పాటు చేసిన రైతులకు దాన్యం సొమ్ము బకాయిలు చెల్లించేందుకు వచ్చిన మంత్రికి జనసేన నేత రెడ్డి అప్పలనాయుడుతో పాటు నారా శేషు నారా శేషు, ఇతర జనసేన నాయకుడు పుష్పగుచ్చాలు ఇచ్చి దుస్సాలువాతో సన్మానించారు.

లైంగిక వేధింపుల కట్టడిపై అవగాహన

విశాలాంధ్ర- పాలకోడేరు : మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులకు అరికట్టడంపై సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి ఆధ్వర్యంలో మోగల్లు సచివాలయంలోని మహిళా ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా

ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పురుషులతోపాటు మహిళలు కూడా ప్రతి రంగంలో ముందుంటున్నారని ఆ క్రమంలో మహిళలు పనిచేసే ప్రదేశాలలో చాలామంది లైంగిక వేధింపులకు గురవుతున్నారని, లైంగిక వేధింపులు అరికట్టాలంటే ప్రతి ఒక్క మహిళ చైతన్యం కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఎవరైనా పని చేసే చోట మహిళలను లైంగికంగా వేధించడం గాని, అనవసరంగా తాకటం గానీ చేసినట్లయితే తోటి మహిళా ఉద్యోగులకు గాని, ఉన్నతాధికారుల దృష్టికి గాని తీసుకుని వెళ్లి ఎవరైతే అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారో వారికి తగినగుణ పాఠం చెప్పచ్చు అన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా ఉద్యోగులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రోగులకు వైద్య సేవలు సిబ్బంది సక్రమంగా అందించాలని, మండల పరిషత్ అధ్యక్షులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గంజీమాల రామారావు ఆదేశించారు. వర్షాకాలపు సీజనల్ వ్యాధులకు చికిత్సలు జరుగుగుతున్న విధానాన్ని ఎంపిపి ఆకస్మికంగా సోమవారం ఆసుపత్రిలో తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఒపి జరుగుతున్న విధానాన్ని, వార్డులో రోగులకు అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు. కొయ్యలగూడెం ఆస్పత్రి ద్వారా 26 మందికి కంటి ఆపరేషన్లు చేయిస్తున్న విధానాన్ని ఆప్తాలమిక్ అసిస్టెంట్ చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో గౌరవభావంగా మెలగాలని తెలిపారు. రక్తహీనతతో ఉన్న గర్భిణీ స్త్రీలతో ఎంపిపి మాట్లాడి అందుతున్న సేవలు గురించి తెలుసుకున్నారు.మందులు కొరత లేకుండా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారిని తస్లీమా, ఆప్తాలమీక్ అసిస్టెంట్ చలవాద చక్రవర్తి ,హెల్త్ అసిస్టెంట్ దండే రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన ఎంపీ మహేష్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : జిల్లాలోని ప్రజలకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కలెక్టర్ వెట్రి సెల్వి దృష్టికి తీసుకువెళ్లారు. ఇందులో భాగంగా అంధ విద్యార్థి శివప్రసాద్ ఉపాధి కల్పించాలని కోరారు. ఆగష్టు 15వ తేదీన జంగారెడ్డిగూడెం గురుకుల ఐఐటీ అకాడమీ విద్యార్థి సూర్య తేజస్వితో పాటు అమెరికా ఫీల్డ్ సర్వీస్ కల్చరల్ ఎక్స్చేంజ్ కార్యక్రమానికి భారతదేశం నుండి 30 మంది ఎన్నికకాగా, ఏలూరు జిల్లా నుండి ఎన్నికై అమెరికా దేశం వెళుతున్న తేజస్వికి ప్రశంసా పత్రం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఏలూరు పార్లమెంట్ కు సంబంధించిన కేంద్ర ప్రభుత్వం నుండి పెండింగ్ లో ఉన్న దీర్ఘకాలిక ప్రాజెక్ట్ పనుల వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. టి.నర్సాపురంలో త్రాగు నీటి అవసరాలు నిమిత్తం బోరు, పైప్ లైన్ వెయ్యాలని, కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం ఫండ్స్ నుండి అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ వెట్రి సెల్విని ఎంపీ పుట్టా మహేష్ కోరారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

విశాలాంధ్ర-లింగపాలెం: సుందర రాజుపేటలో పొదిలి ప్రసాద్ కుమారి దంపతులకు చెందిన ఇల్లు దగ్ధమవడంతో తీవ్ర నష్టం జరిగిన ఈ కుటుంబానికి ఎమ్మెల్యే రోషన్ కుమార్ రూ. 10వేలుఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే చేసిన సాయాన్ని పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు ఘంటా రాజేంద్ర, జాస్తి శీను,రమేష్ తదితరులు బాధిత కుటుంబానికి అందించారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెలజెండా రెపరెపలాడాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: దేశం గర్వించేలా 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను రెపరెప లాడించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ నందు శ్రీవిజ్ఞాన వేదిక, హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జెండా ర్యాలీలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక హౌసింగ్ బోర్డ్ నుండి ప్రారంభమైన 400 మీటర్ల జాతీయ జెండాతో చేపట్టిన స్వాతంత్ర దినోత్సవ మహోత్సవ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ వరకు జరగనున్న హర్‌ఘర్ తిరంగా మహోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా కార్యక్రమాలను రూపొందించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఉత్సాహంగా ప్రతి ఇంటికి జెండాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ నాగమణి, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మృతికి సీపీఐ సంతాపం

విశాలాంధ్ర-కామవరపుకోట: తహసీల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న ఎండి మొహిద్దీన్ మృతికి సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు ప్రగాఢ సంతాపం తెలిపారు. తనకోసం కార్యాలయానికి వచ్చే ప్రజలను ఆప్యాయంగా పలకరించే మొహిద్దీన్ మృతికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కరేటి నరసింహులు, జి. సత్యనారాయణ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు చలమాల శ్రీనివాసరావు, మీసుగుల దుర్గారావు, టి. రాములమ్మ, వై.స్వామిదాసు, తదితరులు ఆయన మృతికి సంతాపం తెలిపి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తే క్రిమినల్ చర్యలు

-భీమడోలులో ఇద్దరిపై కేసు నమోదు, 3 వాహనాలు సీజ్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : జిల్లాలోని చేపల చెరువులలో కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తే క్రిమినల్ తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి హెచ్చరించారు. భీమడోలు మండలం



పెదలింగంపాడు గ్రామంలో సోమవారం ఘంటా మోహనరావు, లంక నాని అనే ఇరువురు చెరువులకు మూడు లారీలలో కోడి వ్యర్థాలు చేపల చెరువులకు తరలిస్తున్నారనే సమాచారంతో భీమడోలు తహసీల్దార్ ను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అప్రమత్తం చేసి సదరు లారీలను సీజ్ చేసి వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై రెవిన్యూ, పోలీసు, మత్స్య శాఖ అధికారులతో కూడిన మండల టీం వెంటనే దాడిచేసి భీమడోలు రైల్వే గేటు వద్ద కోడి వ్యర్థాలతో గ్రామానికి వెళుతున్న 3 లారీలను సీజ్ చేసి, ఘంటా మోహనరావు, లంక నానిలపై కేసులు నమోదు చేశారు. కోడి వ్యర్థాలను భీమడోలు డంపింగ్ యార్డ్‌లో పూడ్చి పెట్టామని భీమడోలు తహసీల్దార్ తెలిపారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల

విశాలాంధ్ర- కుక్కునూరు: ఉపాధి కూలీలకు పెండింగ్ ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం కుక్కునూరు మండలంలోని పెదరాయిగూడెం సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పల్లెల నాగలక్ష్మి అధ్యక్షతన ఆందోళన జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి వరక శ్యామల మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి కార్మిక చట్టం 2005లో యుపిఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టి పేదలకు ఆసరాగా నిలిచిందన్నారు. వ్యవసాయ కార్మిక,ఇతర కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగానే ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చిందన్నారు. 2005లో పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి 100 రోజుల పని కల్పించి ఒక్కొక్కరికీ దినసరి కూలీ రూ.50 చెల్లించారని, నేడు రూ.300 పెంచడం వెనుక వ్యవసాయ కార్మిక ,ప్రజా సంఘాల పోరాటాలే ఫలితమని హర్షం వ్యక్తం చేశారు.పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించి, దినసరి వేతనం రూ. 600 ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో మంచినీళ్ళు ,మజ్జిగ, మెడికల్ కిట్లు, టెంట్లు వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు చిన్న పిల్లల తల్లులకు ఆయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి,జిల్లా కౌన్సిల్ సభ్యులు కొన్నె లక్ష్మయ్య, మండల కౌన్సిల్ సభ్యులు పల్లెల భిక్షం,సీతమ్మ, నాగలక్ష్మి, జయమ్మ, భూలక్ష్మి, గాడిద వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

యువత సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు: యువత సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకొని నూతన ఆవిష్కరణ వైపు అడుగులు వేయాలని జిల్లా యువజన సంక్షేమ అధికారి మధుభూషణ రావు అన్నారు. స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ, జిల్లా యువజన సంక్షేమ శాఖ ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెట్విన్ సీఈవో మధుభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు నేటి డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చదువులలో ముందంజలో ఉండాలని అన్నారు.కొత్త కొత్త వృత్తి నైపుణ్య కోర్సులను నేర్చుకొని జీవితంలో బాగా స్థిరపడాలని ఆకాంక్షించారు. స్ఫూర్తి సంస్థ కార్యదర్శి షేక్ మొహిద్దీన్ భాష మాట్లాడుతూ జీవితంలో ఎదగాలంటే మంచి క్రమశిక్షణ పట్టుదల, స్వీయ క్రమ.శిక్షణ అలవర్చుకుంటే ఉన్నత స్థానానికి

చేరవచ్చని ఉద్బోధించారు. మానవతా సంస్థ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి విలువలను కలిగి ఉంటేనే మంచి స్థాయికి చేరవచ్చన్నారు. మానవత జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు అనంతరం ఉదయం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన డిబేట్ క్విజ్ పోటీలలో విజేతలకు స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ద్వారా మెమెంటోలు సర్టిఫికెట్లు అతిథుల ద్వారా అందజేయబడ్డాయి ఈ కార్యక్రమంలో సెట్ వెల్ మేనేజర్ సత్యనారాయ, కళాశాల కోఆర్డినేటర్ సౌభాగ్య లక్ష్మి , విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆదరించండి

విశాలాంధ్ర-ఏలూరు: రైతులు ఎటువంటి రసాయనాలు లేకుండా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి ఆరోగ్యవంతులుగా ఉండాలని వినియోగదారులకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచించారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరం వద్ద సోమవారం ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పతుల స్టాల్ ను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సందర్శించారు. ఏలూరు జిల్లాలోని పెదవేగి, పెదపాడు, ఏలూరు, చింతలపూడి, కామవరపుకోట మండలాల్లోని 11 మంది రైతులు ఎటువంటి రసాయనాలు లేకుండా పండించిన 24 రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులందరితో మాట్లాడి, ఉత్పత్తులను స్వయంగా కలెక్టర్ కొనుగోలు చేశారు. రైతులందరూ రసాయనాలు లేకుండా పంటలు పండించి, అందరికీ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించాలని సూచించారు. ప్రతీ సోమవారం ఏలూరు జిల్లా లోని అన్ని చోట్ల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు

తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంటలకు కావలిసిన అగ్నిస్త్రం, పంచగవ్య,జీవామృతం వంటి కాషాయాలు ద్రావణాలతో పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను స్టాల్‌లో అందుబాటులో ఉంచామని రైతులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయం వారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ కు ప్రజల నుండి అధికారుల నుండి మంచి స్పందన వస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, జిల్లా వ్యవసాయ అధికారి హాబీబ్ భాషా, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర-నరసాపురం: ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఏఐఎస్ఎఫ్ జండాను బి.సి. హాస్టల్ వద్ద నెక్కంటి క్రాంతి కుమార్ ఆవిష్కరించారు. బి.సి., ఎస్.సి, ఎస్.టి, విద్యార్థుల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించి వారి కోసం అనేక హక్కులు సాధించిన ఘనత ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంకే దక్కుతుందని న్యాయవాది నెక్కంటి క్రాంతి కుమార్ అన్నారు. ఎందరో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు మంత్రులు, ఎం.పిలుగా ఎదిగారని అన్నారు. క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు పెంచే దిశగా ఏఐఎస్ఎఫ్ నిలిచిందన్నారు. జిల్లా కార్యదర్శి కె. సుందర్, ఈ కార్యక్రమంలో యామిని, మహిమ, లోకేష్ సంతోష్ కుమార్, కౌశిక్, వీరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

యనమదుర్రు డ్రైన్‌లో నీటి పిల్లులు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ఎక్కడో మడ అడవుల్లో, సముద్ర జలాశయాల్లో కనిపించే నీటి పిల్లులు ఒక్కసారిగా భీమవరం యనమదుర్రు డ్రైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. ఈ నీటి పిల్లలు సంఖ్య చాలా అరుదుగా కనిపిస్తు ఉంటాయి, అటువంటి నీటి పిల్లలు యనమదుర్రు డ్రైన్‌లో సందడి చేయటం చూపరులకు కనువిందు చేశాయి. ఎగువన కురిసిన వర్షాలు ప్రభావంతో నది జలాశయాల నుండి ఇటు కొట్టుకొచ్చి ఉంటాయని పలువురు అంటున్నారు.

ఉపాధ్యాయ సంఘాల ఆందోళన

విశాలాంధ్ర- లింగపాలెం: పని సర్దుబాటు అంటూ ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలను నిలుపుదల చేయాలంటూ లింగపాలెం మండలంలోని అన్ని ఉపా ధ్యాయ సంఘాల నాయకులు లింగపాలెం విద్యాశాఖ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. జీవో117ను రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.పని సర్దుబాటు పేరుతో అసంబద్ధంగా బదిలీలు చేస్తున్నారని నాయకులు విమర్శించారు. ఏపీటీఎఫ్, యుటిఎఫ్, ఎస్టియు, డిడిఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళనలో పాల్గొని మండల విద్యాశాఖ అధికారి రామారావుకు వినతి పత్రం అందజేశారు.

సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-భీమవరం: పర్యావరణానికి హితము చేకూర్చడంతోపాటు, డబ్బు ఆదా అయ్యే సోలార్ విద్యుత్ ను ప్రతి ఇంటిపై ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ నాగరాణి విద్యుత్ అధికారులు, సోలార్ వెండర్స్ తో సమావేశమై ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఏర్పాటుతో పర్యావరణానికి మంచి జరుగుతుందన్నారు. విద్యుత్ బిల్లు సగానికి పైబడి ఆదా అవుతుందని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ పై ప్రభుత్వం అధిక మొత్తంలో రాయితీని అందజేస్తుందన్నారు. తొలుత కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం క్రింద సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడానికి సమాచార గోడ ప్రతిని, కరపత్రాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

హోంమంత్రిని కలిసిన ఖండవల్లి

విశాలాంధ్ర - రాజానగరం : ఎస్సీ,ఎస్టీ ప్రజలకు మరింత మేలు చేకూర్చి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్సీ సెల్ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి ఖండవల్లి లక్ష్మి కోరారు. రాజమహేం ద్రవరంలో ఓ కార్యక్రమానికి సోమ వారం విచ్చేసిన ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ఖండవల్లి లక్ష్మి కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భం గా జిల్లాలో ఎస్సీ వర్గీకరణకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్య లను హోంమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు.ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాతనైన ఎస్సీ ఎస్టీ వర్గాలకు మంచిరోజులు వస్తాయని ఆకాంక్షిస్తు న్నామని తెలిపారు.హోంమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సాయిశ్రీ ప్రియకు నాట్యరవళి పురస్కారం

విశాలాంధ్ర - పెరవలి : పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన ప్రముఖ నాట్య కళాకారిణి కుమారి నరుకుల సాయిశ్రీ ప్రియ నాట్యరవళి పురస్కా రాన్ని అందుకున్నారు. కళారంగంలో విశేష ప్రతిభను కనపరిచే వారికి అందించే ఈపురస్కారాన్ని తాడేపల్లి గూడెం పట్టణం బి.వి.ఆర్. కళాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కళాప్రియ బుద్దాల వెంకట రామారావు కళా ప్రేమికులు, పట్టణ పుర ప్రముఖులు ఈపురస్కారాన్ని ఆమెకి అందజేశారు. ఈనృత్య ప్రదర్శనలో సరస్వతి, హాసిని, దేవి, రేణుక, హర్షిత, భువనేశ్వరి, వైష్ణవి, నాగ హర్షిత, కుసుమ, శ్వేత బృంధం చేసిన నృత్య ప్రదర్శనలకు ప్రేక్షకుల అభినందనలు లభించాయి.నాట్యంలో రాణి స్తున్న సాయి శ్రీప్రియను ఖండవల్లి గ్రామంలో ప్రముఖులు అభినందించారు.

ఆర్య వైశ్యులు ఇంటిపై జాతీయ జెండాలు

విశాలాంధ్ర - అమలాపురం : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం, అమలాపురం ఆధ్వ ర్యంలో రానున్న ఆగస్టు 15వ తేదీ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఆర్యవైశ్యున్ని ఇంటిపైన జాతీయ జెండా ఎగరా లనే సంకల్పంతో ఆర్య వైశ. సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకాపర మేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద శ్రీ వాసవి ఫంక్షన్ హాల్లో కాళ్ళకూరి కుమార్ సంఘానికి అందించిన సుమారు వెయ్యి జాతీయ జెండాలను సోమ వారం మధ్యాహ్నం నుండి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, గౌరవ అధ్యక్షులు యెందూరి వెంకట్రామయ్య, వంకాయల కాశీ, వరదా సూరిబాబు, నందిపాటి శ్రీనివాస రత్నకుమార్, తూర్పు గోదవరి జిల్లా మహిళా అధ్యక్షురాలు యెం దూరి సీతా మహాలక్ష్మీ, నంబూరి నానాజీ, శింగంశెట్టి కుమార్, చక్కా ప్రవీణ్, మోటమర్రి కుమార్, పసలపూడి సతీష్, మండపల్లి నాగేశ్వరరావు, సుగ్గు గోపి, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొని జాతీయ జెండాలను అందుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం అందిస్తాం

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

విశాలాంధ్ర - పి గన్నవరం : గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పి గన్న వరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారా యణ తెలిపారు. ఈ మేరకు ఆయన పి గన్నవరం మండల పరి షత్ కార్యాలయం వద్ద ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన సర్పంచులకు, పంచాయతీ కార్యద ర్శులకు నిర్వహించిన శిక్షణ తరగ తులలో పాల్గొన్నారు. గ్రామాలలో ఏ విధమైన సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఎంపీడీవో త్రిశూల పాణి ఆధ్వర్యంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు వివిధ అంశాలపై అవ గాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు యర్రంశెట్టి త్రివేణి పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి

ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - అనపర్తి : ప్రతి భారతీ యుడులో జాతీయ భావం నెలకొనాలని కుల,మత ప్రాంతాలకతీతంగా దేశ ఔన్నత్యాన్ని ప్రతి పౌరుడు ప్రపంచానికి సాటి చెప్పాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా స్థానిక కెనాల్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి నిర్వహించిన హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. శ్రీ నల్లమిల్లి మూలారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీరాజ్ శాఖ, ఐటిసి ఆధ్వర్యంలో సుమారు రూ.9.50 లక్షలతో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను),డాక్టర్ తాడిరామ గుర్రెడ్డి, సర్పంచ్ గొల్లు హేమ తులసి, సిరసపల్లి నాగేశ్వరరావు, వెంకటరామారెడ్డి, ప్రసాద్ రెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి కూటమినేతలు పాల్గొన్నారు.

ప్రజలకు,పోలీసులకు మధ్య వారధి మీడియా

విశాలాంధ్ర - ఆలమూరు : ప్రజలకు పోలీసులకు మధ్య వారధిగా మీడియా వ్యవస్థ పని చేస్తుందని, లాఅండ్ఆర్డర్ను అదుపులో ఉంచే దుకు మీడియా సహకారం ఎంతైనా అవసరమని ఎస్సై ఎం అశోక్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైను ఇటీవల పాత ప్రెస్ క్లబ్ నుండి విడిపోయి నూతనంగా ఏర్పాటు చేసుకున్న కోన సీమ ఆలమూరు ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సత్క రించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమస్యలు, అసాంఘిక కార్య కలాపాలు, అక్రమ రవాణా అరికట్టడం, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు, ఆందోళనలకు గురిచేసే చర్యలను మీడియా సహాయా సహకారా లతో ప్రజలకు అవగాహనా కలిపించి మార్పు తీసు కురావచ్చని ఆయన అన్నారు. త్వరలోనే మీడియా సభ్యులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మరిన్ని సమస్యలను అడిగి తెలుసుకుంటామన్నారు. పోలీస్ శాఖకు మా వంతు సహాయ సహకారాలు ఎల్ల వేళలా అందిస్తామని కోనసీమ ఆలమూరు ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె పూర్ణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వడ్డీ గంగాధర్, కార్యదర్శి గుండపు గోపాలకృష్ణ, ఉప కార్యదర్శి పెట్ట రంగనాథ్, ట్రెజరర్ గంటా మధు, సభ్యులు ఉండమట్ల నాగ శివ, చాపల రామారావు, పండి సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు కొనసాగించాలి

కలెక్టర్కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం మండలం వన్నె చింతపూడిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణపు పనులను యధావిధిగా కొనసా గించాలనీ జిల్లా కలెక్టర్కు పలువురు వినతిపత్రం సమర్పించారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రతి పార్ల మెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాలను రూ.500 కోట్ల నిధులతో నిర్మించాలని భావిం చింది. అయితే అమలాపురం కళాశాలను థర్డ్ ఫేజ్ లో మంజూరు చేశారు. నిర్మాణపనులు చేపడుతు న్న కాంట్రాక్ట్ సంస్థకు నిర్మాణ పనులను ఆపాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు రావడంతో కాంట్రాక్టర్ పనులకు వినియోగించే సామాగ్రిని రాత్రివేళ సమ యంలో పట్టుకుని వెళుతున్నారని. గ్రామానికి చెం దిన నాయకులు ఫిర్యాదును అందజేశారు. కోన సీమ జిల్లా వాసులకు ఎంతగానో ఉపయోగపడే కళాశాలను నిర్మించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పందిరి శ్రీహరి. రాజుల పూడి భాస్కరరావు. నక్కా చంద్రశేఖర్. పొనగల గణేష్. జలదాని కాశి, జి ఏసుబాబు, మండలానికి చెందిన పలువురు సర్పంచులు ఉన్నారు.

శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఎమ్మెల్యే చినరాజప్ప

విశాలాంధ్ర - పెద్దాపురం : విద్యార్థి శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడు తాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు, స్థానిక జవహార్ నవోదయ విద్యా లయలో సోమవారం రీజనల్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యా లయ ఇన్చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కబడ్డీ మీట్లో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లా డుతూ విద్యతో పాటు క్రీడల పట్ల చురుకు తనం చూపించాలన్నారు. నవోదయలో విద్యన భ్యసించిన ప్రతీ విద్యార్థి ఉన్నత స్థితిలో ఉన్నారని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లా డుతూ క్రీడాసక్తి పట్ల మెరుగైన ఆరోగ్యం, మంచి జీవితం అనుభవిం చవచ్చన్నారు. ఎమ్మెల్యే చిన రాజప్ప క్రీడా జ్యోతిని క వెలిగించి కబడ్డీ మీట్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా జేవన్ని ప్రిన్సిపాల్ పరుశురామయ్య, పీఈటి సత్యన్నారాయణ. జగన్మో హనరావు, సుధీర్ కుమార్, పీజీటీ ఇంగ్లీష్ సత్యన్నా రాయణ. ఆయా జేవన్విల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లకు ఘన స్వాగతం

విశాలాంధ్ర - కొత్తపేట : కోనసీమ జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపేటకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్కు స్థానిక శాసన సభ్యులు బండారు సత్యానందరావు, కొత్తపేట కాపు కల్యాణమండపం వద్ద పుష్ప గుచ్ఛం అం దించి సాదర స్వాగతం పలికారు. మంత్రి వెంట మండపేట ఎమ్మెల్యే వేగుల జోగేశ్వరావు, గన్న వరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జనసేన పార్టీ ఇంచార్జి బండారు శ్రీనివాస్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి భాస్కం రావు, ధరణాల రామకృష్ణ, కెవి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల పట్టాభి, చిలువూరి సతీష్ రాజు, చోద పనీడి ఉమ, బీర ఇస్సాక్, యాళ్లమిల్లి జగన్మో హన్, బండారు సూర్యనారాయణ, తృమా బాబు, పప్పుల కొత్తయ్య, చింతం కృష్ణ, తమ్మన సాయి ప్రసాద్, గణిశెట్టి వీరేష్ బండారు వీరబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

పి గన్నవరంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

లోకేష్ను కోరిన నామన రాంబాబు

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం నియోజకవర్గ కేంద్రమైన పి గన్నవరంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నామన రాంబాబు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ను ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద రాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. నియో జకవర్గంలోని సమస్యల గురించి ఆయన మంత్రికి తెలియజేశారు. అన్న క్యాంటీన్ ఏర్పాటుకు సహకరిస్తానని నారా లోకేష్ తెలియజే శారని, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణను కలిసి అన్నా క్యాంటీన్ ఏర్పాటుపై చర్చించగా, రెండవదశలో అన్న క్యాం టీన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు నామన తెలిపారు. శ్రీను, నిమ్మ కాయల శేషు ఉన్నారు.

లారీ ఢీకొని పాడిగేదె మృతి



విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం తాళ్లూరు సెంటర్ వద్ద రోడ్డు దాటుతున్న పాడి గేదెను రాజమండ్రి వైపు నుండి జగ్గంపేట వైపు వెళ్లే లారీ ఢీకొనడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె ఒక్కసారిగా రోడ్డుకు అడ్డం రావడంతో లారీ అదుపు చేయలేక ఈ ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ అన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు తెలిపారు.

ఆదిత్యలో రంగనాథన్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గ్రంథాలయ విభాగం వారి ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు డా ఎస్ఆర్ రంగనాథన్ 132వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గ్రంథ పాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా జి సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని డా ఎస్ఆర్ రంగనాథన్ చిత్ర పటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల వికాస అభివృద్ధి గ్రంథ పాలకుల పాత్ర ఎంతో ప్రముఖ పాత్ర వహిస్తుంది అన్నారు. గ్రంథాలయ విభాగం అధికారి కె అశోక్ మాట్లాడుతూ గ్రంథాలయ పితామహుడు డా ఎస్ఆర్ రంగనాథన్ జన్మదినాన్ని జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవంగా జరుపుకొంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రంథా లయ విభాగం సిబ్బంది. నాగబాబు, సోమరాజు, రమ్య, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వివేకానంద

విశాలాంధ్ర - పెదపూడి : యువతి యువకుల స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానందుడని, ఆయన జీవితం అన్ని తరాల వారికి అనుసరణీయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోక్‌సభ పార్లమెంట్ బిజెపి కార్యాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎ వేమా, బిజెపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ వాయిదా

విశాలాంధ్ర - ఏలూరు : ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యం మేరకు టీచర్ల పని సర్దు బాటు ప్రక్రియను ప్రభుత్వం తాత్కాలికంగా వాయి దా వేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యా యుల వర్క్ అడ్జస్ట్ మెంట్ ప్రక్రియ సోమవారం నిర్వహించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి సర్ప్లస్ ఉపాధ్యాయ జాబితాలను మండలాల వారిగా విడుదల చేశారు. ఈ జాబితాలు అసంబద్ధంగా ఉన్నాయంటూ ఉపాధ్యాయులు వ్యతిరేకించారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల స్థాయిలో పని సర్దుబాటు కౌన్సిలింగ్‌ను బాయ్ కాట్ చేశారు. రాష్ట్ర స్థాయి నాయకత్వం కూడా ఉపాధ్యాయుల పని సర్దుబాటులో ఉన్న అసంబద్ధమైన అంశాలను విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. లోపభూయిష్టంగా ఉన్న పని సర్దుబాటు ప్రక్రియను ఆపాలని ఉపాధ్యాయ సంఘాల కోరాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పని సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈ నెల 15న ఉపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, 16న జాబితాలు విడుదల చేసి, 17న తిరిగి పని సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు.

'మెగా జాబ్‌మేళా' బ్రోచర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పిఠాపురం : కలెక్టర్ ఛాంబర్లో "వికాస" ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ శనివారం పిఠాపురంలో జరిగే "మెగా జాబ్‌మేళా" బ్రోచర్ను కలెక్టర్ సగిలి షాన్ మోహన్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె లచ్చారావు మాట్లడుతూ ఈ జాబ్‌మేళా ద్వారా సుమారు 36 కంపెనీలతో 2500 ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే కంపెనీల వివరాలతో ఉన్న బ్రోచర్ను, బులిటెన్ను కలెక్టర్‌కి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ తిప్పే నాయక్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణి, డివిఎస్‌ఓ హరిశేషు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను అత్యంత నాణ్యతతో పరిష్కరించాలి

కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను అత్యంత నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ,డీఆర్వో డా డి తిప్పేనాయక్, జడ్పీ సీఈవో శ్రీరామచంద్ర మూర్తి, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, సీపీవో పీ త్రినాథ్‌బీ డీఎల్డీవోలు పి నారాయణ మూర్తి లతో కలిసి హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. 381 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ అర్జీల పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సోషలిస్ట్ వ్యవస్థలోనే సమాన అవకాశాలు

విశాలాంధ్ర - రాజోలు : బడుదారి వ్యవస్థలో కన్నా సోషలిస్ట్ వ్యవస్థలో అన్ని రంగాలలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ బుచ్చిబాబు అన్నారు. మలికిపురం ఎంఎవిఎన్‌జే ఎస్ అండ్ ఆర్ విఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు దేవ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందే ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ స్వాతంత్ర్య పోరాటంలోనే కాకుండా విద్య సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిందని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాల పట్ల తీవ్రంగా ఖండించారు. ఎంతోమంది ఏఐఎస్ఎఫ్‌లో పనిచేసిన వారు పెద్దపెద్ద రంగాలలో ప్రవేశించి ఈ దేశ అభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్, జవహర్లాల్ నెహ్రూ, అబ్దుల్ కలాం లాంటి ఎందరో గొప్ప వ్యక్తులు ఏఐఎస్ఎఫ్‌లో పనిచేశారని వారిని ఆదర్శంగా తీసుకొని మన విద్యార్థులు ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త భూపతి అజయ్ కుమార్, ఏఐఎఫ్‌డిటి విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మంగెన సత్యనారాయణ మూర్తి, దీప్తి మహిళా కళాశాల ప్రిన్సిపల్ సుధా, మలికిపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సతీష్, గురయ్య కళాశాల ప్రిన్సిపల్ రాంబాబు, అధ్యాపకులకు నక్క రమేష్ బాబు, విద్యార్థి సంఘ నాయకులు రాపాక మహేష్, తాడి రవీంద్ర, పోలిశెట్టి గణేష్, తాడి సహదేవ్, నక్క సంజయ్, జిల్లెల్ల ఉదయ్, అడబాల చందు, ఐ మణికంఠ, కె రోహిత్, ఎండి రషీద్, అభి పాల్గొన్నారు.

రంగనాథన్ ఒక పరిశోధన భాండాగారం

విశాలాంధ్ర - రాజానగరం : పుస్తక సేకరణలో రంగనాథన్ ఒక పరిశోధన భాండాగారం వంటి వారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గ్రంథాలయ దినోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలోని నన్నయ వర్సిటీ నందు సోమవారం జరిగిన జాతీయ గ్రంథాలయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ సుధాకర్ తొలుత రంగనాథన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రంథాలయ నిర్వహణకు సం బంధించి గొప్ప పరిశోధన శాస్త్రవేత్తగా రంగ నాథన్ నిలిచారని కొనియాడారు. లైబ్రరీ నిర్వహణ, సమాచార సేవలను వేగంగా చదువరులకు అందించటంలో ఆధునిక గ్రంథాలయ పద్ధతులను తీర్చిదిద్దటంలోనూ రంగనాథన్ రచనలు పునాదిగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య బి.జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.నూకరత్నం, ఎస్.లింగారెడ్డి, డాక్టర్ టి.సింహా చలం, డాక్టర్ టి.వాసు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచాయతీల రిప్రెష్మెంట్‌పై శిక్షణ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో సీతానగరం గ్రామంలో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీల రిప్రెష్మెంట్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. దీనిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంచాయతీలు సమూలన ప్రక్షాళన దిశగా అభివృద్ధి వైపు పరుగులు పెట్టే విధంగా మార్పులు చేర్పులు చేయడానికి , దానికి అనుగుణంగా రాబోయే రోజుల్లో గ్రామాలలో శానిటేషన్, వీధి దీపాలు, పంచాయతీ డెవలప్మెంట్ వంటి వాటి పై శిక్షణ అందించారు. ఈ శిక్షణకు 76శాతం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ వీరేంద్ర, అన్ని గ్రామల పంచాయితీ సర్పంచ్లు, కార్యదర్శుల పాల్గొన్నారు.

తాళ్లపూడి తహశీల్దార్‌గా రవీంద్రనాథ్ నియామకం

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మండల నూతన తహసీల్దార్‌గా బీర రవీంద్రనాథ్ నియమితులై, సోమవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. ఈయన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కే.గంగవరం మండలం తహసీల్దార్‌గా ఎన్నికల విధులు నిర్వహించి బదిలీపై తాళ్లపూడి మండలానికి వచ్చారు. ఎన్నికలకు ముందు గోపాలపురం తహసీల్దార్‌గా పనిచేసారు.

జాతీయ జెండాలతో ర్యాలీ

విశాలాంధ్ర-దేవరపల్లి: హర్ గర్ కా తిరంగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కార్యక్రమంలో ఎంపీపీ దుర్గారావు వైస్ ఎంపీపీ సాది సుబ్బారావు ఎంపీడీవో ప్రభాకర్ రావు సర్పంచ్‌లు కడిమి వీర కుమారి, బొంత నాగమణి, బొంత భరత్ బాబు, సూతలపాటి వెంకటరమణ, రావి అన్నపూర్ణ , మండలం సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు దొక్కానాథ్ బాబు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - పి గన్నవరం : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అమలు పరిచే మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద తెదేపా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గన్నవరం నియోజకవర్గంలోని రహదారులు అధ్వానంగా మారాయని, పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ రహదా రులను అభివృద్ధి పరిచేందుకు నిధులు విడుదల చేసి సహకరించాలని నాథ్ బాబు లోకేష్‌ను కోరారు.

విలీన దస్త్రాలు స్వాధీనం చేసుకోవాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 6 గ్రామాల వినతులు

విశాలాంధ్ర - కాకినాడ : 2017లో కాకినాడ కార్పోరేషన్ నుండి వెనక్కి తీసుకు వెళ్లిన తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల పంచాయితీ దస్త్రాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని 6గ్రామాల పౌరులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో సోమవారం వేర్వేరుగా 6 ఫిర్యాదులు దాఖలు చేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతి వివరాలు తెలియజేసారు. ఆరేళ్ల క్రిందట రాష్ట్ర గవర్నర్ ఆర్డినెన్సు మేరకు కాకినాడ అర్బన్‌లోని 6గ్రామాల పంచాయితీ రికార్డులను ప్రభుత్వ గెజిట్ ద్వారా పంచాయితీ రాజ్ నుండి వేరు చేసిన ప్రక్రియ మేరకు విలీనం చర్యల ద్వారా స్వాధీనం చేసుకోగా పౌర సౌకర్యాల రికార్డు మెయింటినెన్స్ కోసం తీసుకు వచ్చిన దస్త్రాలను అప్పటి కలెక్టర్ నీతూ కుమారి ప్రసాద్ వెనక్కివ్వడం జరిగిందని దస్త్రాలు వెనక్కి వెళ్లిన సాంకేతిక సమస్యతో కార్పోరేషన్ ఎన్నికలు 48డివిజన్లకు పరిమితమై 2022 ఆగస్ట్‌లో ముగిసిందన్నారు. కౌన్సిల్ హయాంలో విలీనం విషయమై పంచాయితీ దస్త్రాలను వెనక్కి తీసుకువచ్చే ప్రక్రియను పాలక వర్గం రద్దు చేయాల్సిన రూల్ మేరకు చేయలేదన్నారు. ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ పాలనలో వున్నందున రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినందున 6 గ్రామాల దస్త్రాలను ఆర్డినెన్సు అధికారాల ప్రకారం స్వాధీనం చేసుకోవాలని కోరారు. 13ఏళ్లుగా ఎన్నికలు లేకపోవడం వలన 150కోట్ల రూపాయల నిధులు కోల్పోయిన దుస్థితి ఏర్పడిందన్నారు. విలీనం చేసిన 6గ్రామాలు అర్బన్‌లో వున్నప్పటికీ ఇందుకు తగిన పౌర సౌకర్యాలు దక్కడం లేద న్నారు. 6గ్రామాలు కలపడంలో ఏర్పడిన సాంకేతిక సమస్యను సాకుగా చూపి స్వామినగరం టీచర్స్ కాలనీకి చెందిన 42, 48 డివిజన్లు దూరం కాబడ్డాయన్నారు. దస్త్రాలు వెనక్కి తెచ్చేందుకు ప్రభుత్వ అనుమతులు తీసుకొని తక్షణమే విలీనం నిర్వహణ బైఫర్ కేషన్ విధులు 65 డివిజన్ల ఏర్పాటుతో ఎన్నికల నిర్వహణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విలీన జనాభా కలవడం వలన నగర జనాభా 5లక్షల మేరకు పెరుగు తుందన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో చింతపల్లి అజయ్ కుమార్, జోగా అప్పారావు, పెద్దింశెట్టి రామకృష్ణ, వాసంశెట్టి చంద్రరావు, మేడిశెట్టి రామ్మోహన్, మేడిశెట్టి వెంకటరమణ, సలాది శ్రీనివాస బాబు, అంబటి రామకృష్ణ, టి రాజా, తిరుమలశెట్టి నాగేశ్వరావు, తటవర్తి సుబ్బారావు, అనపర్తి ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 27అర్జీలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేందుకు స్పందన స్థానంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదికకు శ్రీకారం చుటిందని నగరపాలక నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ అన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మంలో ప్రజల నుంచి నగరపాలక సంస్థ కమీషనర్ కేతన్ గర్గ్ 27 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పరిష్కారం చేయాలని ఆదేశించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ పి.యం సత్య వేణి, సూపరిన్టెంట్ ఇంజనీర్ పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.వి.ఎస్. ఎన్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందులు లేని ఆహారం ఆరోగ్యానికి మేలు

విశాలాంధ్ర - పెరవలి : ప్రస్తుత పరిస్థి తుల్లో ఎక్కడచూసిన విషపూరిత ఆహార పదా ర్ధాలే కనిపిస్తుంటాయి. కరోనా కాలం నుండి ప్రతీ ఒక్కరు ఆరోగ్యవిషయంలో ఎక్కువగా జాగ్రత్తలు పాటిస్తున్నా రనడంలో ఏమాత్రం సందేహం లేదు. పెరవలి మండలంలోని గ్రామాలలో పురుగుమందులు ఉపయోగించని కూరగాయలను తీసుకువచ్చి ప్రతీ సోమవారం పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేస్తున్నారని కార్యాలయానికి వచ్చే అధికారులు ప్రయాణికులు స్థానికులు ఈకూరగాయలను కొనేందుకు మొగ్గుచుపుతున్నారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు సిబ్బందికి ఆరోగ్య భద్రత

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు బయటకు వెళ్ళాక నేర ప్రవృత్తివైపు వెళ్లకుండా ఉండేందుకు ఫ్యూయల్ అవుట్ లెట్స్, ప్రిజన్ కేఫ్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర విపత్తుల నిర్వహణ, హోం శాఖ మంత్రి వంగలపూడి వనిత పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఇన్నీస్ పేట సమీపంలో వున్న సబ్ జైలు ఆవరణ లో ఏపి ప్రిజన్స్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ప్రారంభించిన... అనంతరం సెంట్రల్ జైలు, మహిళా జైలు సందర్శిం చారు. ఈ సందర్భంగా సెంట్రల్ జైలు ఎదురుగ ఏర్పాటు చేసిన ప్రిజన్స్ కేఫ్‌ని మంత్రి అనిత ప్రారం భించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హోమ్ మంత్రి అనిత మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఖైదీలకు మంచి ప్రవర్తన కల్గించడంలో భాగంగానే ప్రిజన్స్ కేఫ్, పెట్రోలు బంకు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 16సబ్ జైళ్లు, రెండు సెంట్రల్ జైళ్లు, ఒక స్పెషల్ జైలు ఉండగా, ఒక బోర్స్టన్ జైలు కదుతున్నట్లు వివరిం చారు. జైళ్లలో మొత్తం 3వేల 483మంది ఖైదీలు ఉన్నారని, ఉండాల్సిన సంఖ్య కంటే అధికంగా 700 మంది ఉన్నారని మంత్రి తెలిపారు. రాజమండ్ డిలో 1200 మంది సామర్ధ్యానికి అదనంగా 50 మంది ఉన్నారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయి కేసులపై ఎక్కువ దృష్టి పెట్టామని, రాష్ట్రంలో 1700మందిని అరెస్టు చేయగా, అందులో ఒక్క విశాఖలోనే వెయ్యిమంది వరకు ఉన్నారని, అలాగే రాజమండ్రి జైలులో 376మంది ఉన్నారని హోం మంత్రి అనిత చెప్పారు. సెంట్రల్ జైలు, మహిళా జైలు చూసాక అక్కడి ఇబ్బందులు , సౌకర్యాలు గురించి తెలుసుకున్నామని ఆమె తెలి పారు. ముఖ్యంగా స్నేహ బ్లాక్ చూసిన తర్వాత భావోద్వేగానికి గురయ్యామని హోం మంత్రి అనిత చెప్పారు. ఈ రాష్ట్రాన్ని సుదీర్ఘ కాలం పాలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని చేయని నేరానికి 53 రోజులపాటు జైలులో ఉంచడం దారు ణమని అందుకే ఆయనని పెట్టిన స్నేహ బ్లాక్ ని చూడగానే తట్టుకోలేకపోయానని చెప్పారు. అలాగే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుని కూడా గతంలో అరెస్టు చేసి పెట్టిన బరాక్ కూడా చూశామని ఆమె తెలిపారు. అప్పుడు మా నాయకుడిని అరెస్టు చేసినపుడు ఎంత గానో బాధపడ్డామని ఇప్పుడుఅదే జైలుకి సందర్శ నకు వచ్చామని ఆమె వివరిస్తూ, రోజులు అన్నీ ఒకేలా ఉండవన్నారు. జైలు సిబ్బంది చెప్పిన విష యాలు, సమస్యలు తెలుసుకున్నామని, ముఖ్యంగా సివిల్ పోలీసుల మాదిరిగా ఆరోగ్య భద్రత కల్పిం చాలని కోరారని, ఇప్పటివరకు ఆరోగ్య భద్రత లేకపోవడం శోచనీయమని ఆమె పేర్కొంటూ వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆరోగ్య భద్రత కల్పించ నున్నట్లు ఆమె తెలిపారు. పోలీసుల్లో శారీరక దృఢ త్వాన్ని పెంచే దిశగా నెట్ ప్రాక్టీస్ క్రికెట్ ను మంత్రి అనిత ప్రారంభించి బ్యాట్ తో క్రికెట్‌ను ఆడగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు బౌలింగ్ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వెంట ఎమ్మెల్యే లు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, జైళ్ల ఐజి విశ్వజిత్, డి.ఐ.జి. ఆఫ్ ప్రిజన్స్ ఎం ఆర్ రవి కిరణ్, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ , మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు.

నీటి కుళాయిల పై సర్వే

విశాలాంధ్ర - సీతా నగరం: మండల వ్యాప్తం గా అన్ని గ్రామాలలో సోమవారం నుంచి ఇంటింటికి తాగునీటి కుళాయి సర్వే ఆర్ డబ్ల్యుఎస్ఏ ఈ అవినాష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తం గా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందని అన్నారు. దీనిలో భాగంగా మండల వ్యాప్తంగా గల అన్ని గ్రామ పంచా యతీల పరిధిలో ఇంటింటికి పంచాయతీ సిబ్బంది సహాయంతో సర్వే నిర్వ హించి లేనివారికి త్వరలోనే స్వచ్ఛమైన తాగునీరు అందే విధంగా కుళా యిలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సర్వే నిర్వహించే సిబ్బంది నిభద్ధతతో ఇంటింటికి తిరుగుతూ ఖచ్చితమైన గణాంకాలు అందించాలని ఆదేశించారు.

ఫ్రెండ్లీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన ఫ్రెండ్లీ క్లబ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానికంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబి రాన్ని స్థానిక ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ఆణి విల్ల కామేశ్వరావు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపకులు ఆకొండి నాగ రవీంద్ర జోగయ్య శాస్త్రి మాట్లాడుతూ నేటి సమాజంలో నాణ్యమైన వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందాలని మా ఫ్రెండ్లీ క్లబ్ ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫ్రెండ్లీ క్లబ్ అధ్యక్షులు గ్రంధి నానాజీ, గౌ అధ్యక్షులు తాతపూడి లక్ష్మీ నారాయణ మూర్తి, ఉపాధ్యక్షులు సుంకర పవిత్ర కుమార్, కార్యదర్శి మల్లాడి రాధాకృష్ణ,కోశాధికారి చల్లా గోపీ, ముఖ్య సలహాదారు ఆకొండి ఉమా మహేష్ శర్మ, తటవర్తి వెంకట రత్నం, అఖిల్ రెహమాన్, ప్రసాద్, సుంకరబుజ్జి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సముచిత స్థానంతోనే సమర్థవంతంగా సేవ చేయగలుగుతాం

జనసేన వీర మహిళల మనోగతం

విశాలాంధ్ర - బ్యూరో, కాకినాడ : సుదీర్ఘకాలం జనసేన పార్టీలో కొనసాగినంత ప్రయాణం ఎంతో తృప్తినిచ్చిందని ప్రజలకు సేవ చేయాలంటే నిస్వార్ధ రాజకీయాలకు నిర్వచనం జనసేన పార్టీ అని ఆ పార్టీ వీర మహిళలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా జనసేన పార్టీకి వీర విధేయురాలుగా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సన్నితురాలుగా పార్టీ ఆవిర్భావం నుండి వివిధ పాదాలలో సేవలందిస్తూ పార్టీ విజ యంలో ధనవంతు బాధ్యతను పరిసర సందర్భంగా అభ్యర్థుల విజయానికి ఎనలేని కృషి చేసిన జనసేనకు జీవంపోసిన వీర మహిళ ఎవరైనా ఉన్నారంటే ఆ పార్టీ నాయకులు గర్వంగా చెప్పుకునే వజ్రం లాంటి నాయకురాలు కదలి ఈశ్వరిరే నని జనసైనికులు ఘంటాపథంగా చెబుతారు. జనసేనలో కాపు మహి ళలు ఉంటారన్నది ఎంత నిజమో ఎన్నికల ముందు జనసేనలో శెట్టిబలిజ మహిళలు మచ్చుకైనా కనిపిం చరు అన్నది అంతా నిజం ఎందుకంటే ఆ రెండు కులాలకు మధ్య వున్న వైరం పాము ముంగిస లాంటిదే అలాంటి పార్టీలోకి పవన్ కళ్యాణ్ పట్ల అభి మానాన్ని నింపుకుని జనసేన పార్టీ కండువా కప్పు కుని సుదీర్ఘ కాలంగా జనసేనకి సేవ చేస్తున్న కదలి ఈశ్వరి లాంటి వ్యక్తి తమ పార్టీలో కరుడు కట్టిన నాయకురాలు తమ పార్టీ నేతగా చెప్పుకునేందుకు జనసేన కార్యకర్తలు, నాయకులు గర్వపడతారు. తాను నమ్మిన పార్టీ కోసం రేయింబవళ్ళు శ్రమించి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన కదలి ఈశ్వరి అంటే నాయకులకు ప్రత్యేకమైన గౌరవం. కదలి ఈశ్వరి జనసేన్ పార్టీకి పెద్ద ఎస్సెట్ 2016లో పవన్ కళ్యాణ్ పిలుపు అందుకుని జనసేన్ జెండా చేత బట్టిన కదలి ఈశ్వరి కులసంఘ నాయకుల వత్తిడి మేరకు కొన్నాళ్ళు తెలుగుదేశం పార్టీలోకి వెళ్ళినా ఏ నాడూ ఆ పార్టీ జెండా ముట్టలేదు మళ్ళీ నాదెండ్ల మనోహర్ కాకినాడ రూరల్‌లో పర్యటించినపుడు మనపార్టీకి గుండె కాయ లాంటి కదలి ఈశ్వరి ఎక్కడ వున్నారని అరా తీయగా ఆమె జనసేన వీడినా ఆమె మనసులో జనసేన వుందని అభిమానులు చెప్పగా మనోహర్ కబురు పంపి మళ్ళీ పార్టీ లోకి ఆహ్వానిం చగా ఆమె వెంటనే జనసేనలోకి చేరిపోయారు. గడిచిన ఎన్నికల్లో పోటీ చేయటానికి అవకాశం రాకున్నా కాకినాడ ఎంపి ఎమ్మెల్యే పంతం నానాజీ లా విజయానికి విశేషంగా కృషి చేసి వారి విజ యంలో ముఖ్య భూమిక పోషించిన ఈశ్వరి ఏ స్థానంలో పోటీ చేసినా ఘనమైన మెజారిటీతో గెలిచే ప్రజాదరణ వున్న గొప్ప నాయకురాలు ఈశ్వరి. భర్త ఉద్యోగ రీత్యా పనిచేస్తున్నా కుమారుడు కూడా ఉద్యోగం చేస్తూ ఈశ్వరి సేవా నిరతికి తోడ్పాటు నిస్తుండగా మరో కుమారుడు ఆమెకు పార్టీ కార్యక లాపాల్లో చేదోడు వాదోడుగా సేవలందిస్తు న్నారు అధినేత పవన్ కళ్యాణ్‌కి వీర విధే యురాలుగా పార్టీకి సేవలందిస్తున్న కదలి ఈశ్వరికి నామినేటెడ్ పదవి గానీ పార్టీలో కీలక పదవి లభిస్తుందనీ అంతా భావి స్తున్నారు. సీనియర్ నాయకురాలికి తగినగుర్తింపు ఇవ్వాలని జనసేన శ్రేణులు కోరుతున్నాయి.

విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో కుంద్రపు రాంబాబు, కొండలరావు జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12వ తేదీన ఉత్తరప్రదేశ్లోని లక్నో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని అన్నారు . సమరశీల ఉద్యమల రథసారథి భారత దేశ లోకానికి స్ఫూర్తిని చైతన్యాన్ని కలిగించి సంఘ టిత శక్తిగా ముందుకు నడిపించే శోధక శక్తి అఖిల భారత విద్యార్థి సమాఖ్య అని తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వారు అన్నారు. కేంద్ర బడ్జెట్లో 20 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్లో 10% నిధులను మంజూరు చేయాలని వారు కోరారు. విద్యావ్యవస్థను ప్రైవేటీకరణకు అప్పచెప్పే కుట్రను మానుకోవాలని వారు హెచ్చరించారు. నూతన విద్యా విధానాన్ని 20 20 ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు . జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ సంస్థల ఫీజులు దోపిడీని అరికట్టాలని వారు కోరారు. నన్నయయూనివర్సిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వి కొండలరావు, సంధ్య, పూజ, వర్షిని, చంటి, వినీత ,హారిక, వెంకటకృష్ణ, గోపాల్, సతీష్ ,నవీన్ ,వంశీ, దుర్గ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తోలుబొమ్మలాట కళాకారులకు కలెక్టర్ సత్కారం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రాచీన కాలం నుంచి అత్యంత ప్రజాదరణ పొంది, ప్రస్తుతం అంతరించిపోతున్న తోలుబొమ్మలాటను ప్రజలకు అందుబాటులో ఉంచాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ద్వారా తోలుబొమ్మలాటపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్న కాకినాడ రూరల్ జమునసగర్‌కి చెందిన తోట బాలకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ శాంతి మండలి (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్) పాండిచ్చేరిలో ఇటీవల కళా రత్న అవార్డ్ ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, తోట బాలకృష్ణ దంపతులను సత్కరించారు.ఐక్యరాజ్యసమితి ప్రదానం చేసిన సర్టిఫికేట్, షీల్డ్‌ను జిల్లా కలెక్టర్, బాలకృష్ణ దంపతులకు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

యువత భవిష్యత్తును పాడు చేసుకోవద్దు

సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

విశాలాంధ్ర - కొవ్వూరు : మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు యువత బానిసలై ఉజ్వల భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. స్థానిక కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియా న్ కార్యక్రమం లో ముఖ్య అతి థి గా అశుతోష్ శ్రీవాత్సవ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసలవ్వడం వల్ల విద్యార్థుల జీవితాలతో పాటు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మత్తు పదార్థాలకు యువత బాని సలు అవ్వకుండా ఉండడానికి అవగాహన సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సిడిపిఓ, డి మమ్మీ మాట్లాడుతూ యువత మాదక ద్ర వ్యాల బారిన పడకుండా ఉండటా నికి ఈ రుగ్మతను నివారించ గల మన్న ఆలో చనతో నశా ముక్త భా రత్ అభి యాస్ కార్యక్రమం కేంద్ర సామాజిక , న్యాయ మంత్రి త్వశాఖ నేతృత్వంలో ఏర్పాటు చేశామన్నారు. పట్టణ సీఐ సి ఐ, పి విశ్వం మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకుంటే వ్యసన పరుల్లో వివి ధ విచిత్ర అనుభూతులు కలుగు తుం టాయన్నారు. మొదట్లో ఆనందం కలుగుతుంది, కానీ రానురాను శరీ రం ఆ ప్రభావాలు తట్టుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ, డి. మమ్మీ, సీఐ, పీ విశ్వం, జూని యర్ కాలేజీ ప్రిన్సిపల్, గారపా టి సతీష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, బి.ఉద యభాను, ఆర్. విజయలక్ష్మి, పద్మిని, ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

మువ్వన్నెల జెండా జాతీయోద్యమానికి స్ఫూర్తి

విశాలాంధ్ర -భీమవరం: భారత జెండా జాతీయోద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందని, మువ్వన్నెల జాతీయ జెండా శాంతి, సత్యం, ధర్మం, అహింస జాతీయ సమైక్యతకు నిదర్శనమని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాల్లో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలో అసోసియేషన్ సహాయ సహకారంతో ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ, 400 మీటర్ల జాతీయ జెండాతో దేశ నాయకుల చిత్రపటాలతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. నిర్వాహకులు చెరుకు వాడ రంగసాయి, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కంతేటి వెంకటరాజు, అధ్యక్ష, కార్యదర్శులు సరిపిడకల రామారావు, జానపాటి మధుసూదన్‌రావు మాట్లాడుతూ జాతీయ జెండాల నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని, భావితరాలలో దేశభక్తిని ప్రేరేపించాలని, ప్రతి ఇంటిపైన జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రమేష్, బాల, సిహెచ్ సత్యనారాయణ, సూర్యనారాయణ రాజు, రాంప్రసాద్, కడలి వెంకటేశ్వరరావు, కడలి ఫణి, నంహరిశెట్టి కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, ఆర్ జెడి నాగమణి, మున్సిపల్ కమిషనర్ శ్యామల, వెంకటరావు, వబిలిశెట్టి రామకృష్ణ, ఆదిత్య స్కూల్, చినరంగనిపాలెం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలి

ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య

విశాలాంధ్ర - వేలేరుపాడు : వివిధ స్కీం లలో పనిచేస్తున్న వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని వారు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధారయ్య మాట్లాడుతూ చిరు ఉద్యోగులపై రాజకీయ ఒత్తుడులు వెంటనే ఆపాలన్నారు. వారి మనుషులను ఆయా ఉద్యోగాల్లో ఉంచటం కోసం సంబంధం లేని కారణాలు చూపిస్తూ స్కీం వర్కర్లను ఇబ్బందులకు గురి చేస్తే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనేక ఏళ్లుగా మారుమూల గ్రామాల్లో సక్రమంగా వేతనాలు రాకపోయినా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నా వారిని గుర్తించాలి కానీ ఇబ్బందులు గురి చేయటం సరైన చర్య కాదన్నారు. ఎఅంగన్వాడి వర్కర్స్, ఆయాలు, మిడ్ డే మీల్స్, ఆశా వర్కర్లకు వెంటనే వేతనాలు పెంచాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చందా రమాదేవి, పట్రా లీలావతి, కే కుమారి, నిర్మల, వీరభద్రమ్మ, నాగమణి, సుధారాణి, శ్రీకాంత, విజయ, మడివి రాజేశ్వరి, జి మంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోకుండా చూసుకోవాలి

ప్రైవేటు స్థల యజమానులకు కమిషనర్ భావన సూచన

విశాలాంధ్ర - కాకినాడ : నగరంలోని జనావాసాల మధ్య ఖాళీస్థలాల్లో వర్షం, మురుగు నీరు నిలిచిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఖాళీ స్థలాల యజమానులపై ఉందని ఆమె అన్నారు. పారిశుధ్య నిర్వహణ తనిఖీలలో భాగంగా నగర పాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా నాలుగు, తొమ్మిదో సర్కిళ్లలోని ప్రైవేటు ఖాళీస్థలాలను పరిశీలించారు. యాంటీ లారా యాక్టివిటీస్ చర్యల్లో భాగంగా డ్రోన్స్ స్ప్రే క్లీనింగ్ చేయించే ప్రతిపాదనపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం టిడ్కో గృహాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు ఎలా జరుగుతున్నదీ పరిశీలించారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్ల ప్రారంభించనున్న నేపథ్యంలో వివేకానంద పార్కు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు.

జీతం బకాయిలు చెల్లించాలి

ఏరియా ఆస్పత్రి సిబ్బంది ధర్నా

విశాలాంధ్ర- తాడేపల్లి గూడెం : ఏరియా ఆస్పత్రి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఇవ్వాల్సిన మూడునెలల జీతం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఏరియా ఆస్పత్రి వద్దధర్నా నిర్వహించారు.ఆస్పత్రిలో సెక్యూరిటీ , శానిటేషన్, విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఆస్పత్రి గేటువద్ద ఆందోళన చేపట్టారు. బకాయి జీతాలు చెల్లించాలని, పి.ఎఫ్. బకాయిలను ఈపిఎఫ్ సంస్థకు వెంటనే జమ చేయాలని, పెరిగిన పని భారానికి అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు వీర్రాజు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఇచ్చే జీతాలే తక్కువని, వాటిని కూడా సరిగా ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ప్రతినెలా జీతాలు సకాలంలో చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కారం చేయని పక్షంలో తమ ఆందోళన కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్మికులనుద్దేశించి ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి మందలపర్తి హరీష్ , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.లక్ష్మీనారాయణ (కే.ఎల్.) మాట్లాడారు.యూనియన్ నాయకులు జి.సురేష్, రాంబాబు, శ్రీనివాస్, కుమారి, రమణమ్మ, వెంకటలక్ష్మి , తాయారు నాయకత్వం వహించారు.అనంతరం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా. ఎ.వి. ఆర్.ఎస్. తాతారావుకు వినతిపత్రం అందజేశారు.

ప్రజా సేవకు సత్కారం

- ఎన్ ఎ కుమార్‌కు నందమూరి తారకరామారావు జాతీయ అవార్డు
- నల్లా గోవిందుకు మహాత్మా గాంధీ జాతీయ అవార్డు

విశాలాంధ్ర - పిఠాపురం : పట్టణానికి చెందిన తారక్ సంక్షేమ సేవా సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీడియా కన్వీనర్, జిల్లా జాయింట్ సెక్రటరీ నల్లమిల్లి అర్జునకుమార్‌కు నందమూరి తారక రామారావు జాతీయ స్థాయి అవార్డు, పిఠాపురం పట్టణ తారక్ సంక్షేమ సేవా సంఘం ప్రెసిడెంట్ నల్లా గోవింద్‌కు మహాత్మా గాంధీ జాతీయ అవార్డు లభించాయి. కరోనా కష్ట కాలంలో చేసిన సేవలకు తగిన గుర్తింపు లభించడం పట్ల అవార్డు గ్రహీతలు నల్లమిల్లి అర్జున కుమార్, నల్లా గోవింద్ సంతోషం వ్యక్తం చేశారు. విశాఖపట్నం శ్రీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అతిరథ మహారథుల మధ్య అవార్డుల ప్రదాన ఉత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

అవార్డు గ్రహీతలను సత్కరించి, మెమొంటోలను బహూక రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో తారక్ సంక్షేమ సేవా సంఘం తరపున అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించడం సంతోషంగా ఉందని, అవార్డులు మరింత బాధ్యతను పెంచుతా యని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఫౌండేషన్ సేవా సంస్థసభ్యులు, అవార్డుగ్రహీతల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.